# అవతార పురుషుల మాట, బాట
# చాలా మంగళకరమైనవి

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య**

శుద్ధసత్త్వమనగా ఏమిటో మీరు తెలుసు కోవాలి. అనేక పర్యాయములు మీకు సువర్ణ లింగములను సృష్టించి చూపించాను. అదియే శుద్ధ సత్త్వము. అదియే సర్వత్రా వ్యాపించియున్నది. (భగవాన్ హిరణ్యగర్భ లింగమును సృష్టించి చూపుతూ) "శుద్ధ సత్త్వ మిదియె చూడరయ్య" అన్నీ ఈ శుద్ధ సత్త్వమునుండియే బయలుదేరుతున్నాయి. శుద్ధ సత్త్వము లేని ప్రదేశము ఎక్కడా లేదు. అట్టి శుద్ధ సత్త్వాన్ని ఒక రూపానికి పరిమితం చేయడం పొరపాటు. ఈ రూపములన్నీ శుద్ధ సత్త్వములే. ఈ శుద్ధ సత్త్వము ప్రతి ఒక్కరియందు సూక్ష్మరూపంగా, అణుమాత్ర స్వరూపంగా గోచరిస్తూ ఉంటుంది. ఈ శుద్ధ సత్త్వమే ఒక్కొక్క యుగమునందు ఒక్కొక్క కారణ నిమిత్తమై ఒక్కొక్క అవతారాన్ని ధరిస్తున్నది. కృత యుగమునందు ఈ శుద్ధ సత్త్వమే నారసింహ, వామన ఇత్యాది స్వరూపాలను ధరించింది; త్రేతాయుగమునందు శ్రీరామచంద్రుని స్వరూపాన్ని ధరించింది; ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని రూపాన్ని ధరించింది. భగవంతుడు పదహారు కళలతో కూడి ఉంటాడు. ఆ పదహారు కళలు ఉండినప్పుడే అది పూర్ణతత్త్వము.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే**

sri sathyasai vachanamrutam

ఉన్నది ఒక్కడే, 'ఏకాత్మా సర్వభూతాంతరాత్మా'. రూప, నామములు అనేకంగా ఉండినప్పటికినీ అన్నింటిలో ఉన్న ఏకత్వమే శ్రీరాముడు. పశు, పక్షి, మృగాదుల స్వరూపాన్నికూడా తానే ధరించాడు. అతనొక్కడు తప్ప ఈ జగత్తులో మరి ఏ ప్రాణికూడను నాకు కనిపించడం లేదు. ఒక మృగముకాని, ఒక పక్షికాని ఏదీ కనిపించడం లేదు. అట్టి ఏకాత్మ తత్త్వమునకే 'హిరణ్యగర్భము' అని పేరు.

**కోరికలు పెరిగేకొలదీ భగవంతుడు దూరమౌతాడు**

త్రేతాయుగములో స్త్రీలకు పతివ్రతా తత్త్వమును ప్రబోధించే నిమిత్తమై శ్రీరామచంద్రునితో సీతకూడను అవతరించింది. పదునాల్గు సంవత్సరములు అరణ్యవాసం చేసినప్పటికీ, పది నెలలు లంకలో ఉండినప్పటికీ ఎట్టి పరిస్థితుల యందైనను ఆమె ఒకే మనస్సుతో ఉండినది. రామునికి సమీపంగా ఉండే నిమిత్తమై తన సర్వస్వమును అయోధ్యలోనే వదలిపెట్టి రాముని వెంట అరణ్యానికి వచ్చింది. అటువంటి సీత బంగారు లేడి కావాలని ఆశించింది. ఎప్పుడు ఆ కోరిక బయలుదేరిందో అప్పుడు రాముడు ఆమెకు దూర మయ్యాడు. అనగా, కోరికలు పెరిగేకొలదీ మనకు భగవంతుడు దూరమవుతుంటాడు. Less luggage, more comfort makes travel a pleasure. కనుక మనము కోరికలనే 'లగేజీ'ని తగ్గించుకోవాలి. ఈ లోకంలో బంగారు లేడి ఉండటానికి వీల్లేదని సీతకు తెలుసు. కాని, రామాయణంలో తన పాత్రను పురస్కరించుకొని తనయొక్క తత్త్వమును ప్రపంచానికి బోధించే నిమిత్తమై ఆ బంగారు లేడి తనకు కావాలని కోరింది. ఆ కోరిక మూలంగా ఆమె రామునికి దూరమై చాలా పరితపించింది.

**ఆదర్శ నిరూపణకే అగ్నిపరీక్ష**

అశోకవనమునందు నిద్రాహారములను త్యజించి సీత నిరంతరం రామతత్త్వమునే చింతిస్తూ వచ్చింది. రాత్రింబవళ్లు ఆమెకు రామచింతన తప్ప అన్యచింతలు లేవు. అయినప్పటికీ రాముడు ఆమెను తిరిగి స్వీకరించే సమయంలో అగ్నిపరీక్షకు గురిచేశాడు. ఎందుకోసం? ఆమెయొక్క ఆదర్శాన్ని లోకానికి చాటే నిమిత్తమే. అప్పుడు అగ్నిదేవుడే ప్రత్యక్షమై, "రామచంద్రా! సీత మహా పతివ్రత. నీ నామమును తప్ప అన్య విషయాలను

srisathyasaivachanamrutam

చింతించడం లేదు" అని చెప్పాడు. రాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన తరువాత ఒక చాకలివాడు, "పది నెలలు లంకలో ఉండిన సీతను శ్రీరాముడు తెచ్చుకున్నాడు. నేను అలాంటి పిచ్చివాడను కాదు", అన్నాడు. ఈ వార్త రామునికి తెలిసి, అగ్నిసాక్షిగా తాను వరించి నటువంటి సీతను త్యజించినాడు. అయినప్పటికీ సీత మనస్సు ఒక్క క్షణమైనా చలించలేదు. నిరంతరము రామచింతనే చేస్తూ వచ్చింది. కనుకనే, సీత గొప్ప పతివ్రత. అట్టి సీతకు సమానమైనటువంటి వ్యక్తి మరొకరు జగత్తులో కనిపించడం లేదు. అటువంటి నిశ్చలమైన భక్తితత్త్వాన్ని లోకానికి చాటే నిమిత్తమై రాముడు అవతరించాడు.

**గోపికలతో ఆడుకున్నప్పుడు కృష్ణుని వయస్సు ఏడేళ్ళే!**

తరువాత ద్వాపర యుగములో శ్రీ కృష్ణుడు అవతరించి అనేక లీలలు చూపించాడు. కాని, కృష్ణుని శీలతత్త్వమును ఎవ్వరూ గుర్తించలేదు. గోపికలు వయస్సులో చాలా పెద్దవారు. వారితో లీలా ప్రదర్శన సమయంలో కృష్ణుని వయస్సు ఏడు సంవత్సరాలు. ఏడేళ్ళ బాలుడు గోపికలతో లీలలు చేశాడనటం ఎంత హాస్యాస్పదం! తల్లిదగ్గర ఆడుకున్నట్లుగా కృష్ణుడు గోపికలదగ్గర ఆడుకున్నాడు. కాని, ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక మానవులు 'కృష్ణుడు గోపికాలోలుడు' అని అనేకరకములైన అపోహలు కల్పించి కృష్ణుని అవమాన పరిచారు. శ్రీరామునివలె శ్రీకృష్ణుడుకూడను తన దివ్యత్వాన్ని, ఆదర్శ మానవత్వాన్ని నిరూపించి జగత్తునకు ఆదర్శంగా నిలిచాడు.

ప్రతి యుగమునందు భక్తులను సంరక్షించే నిమిత్తమై దేవుడు అనేక రకములైన అవతారములు ఎత్తుతుంటాడు. భక్తులను సంరక్షించడమే కాకుండా భక్తుల మనస్సును చక్కదిద్దే నిమిత్తమైకూడా వస్తుంటాడు. ద్వాపరయుగంలో కృష్ణుడు దేవకీ వసుదేవులకు జన్మించాడు, యశోదా నందుల దగ్గర పెరిగాడు. తాను పుట్టినది దేవకీ వసుదేవులకు. కాని పేరు వచ్చినది మాత్రం యశోదా నందులకు. కృష్ణుడు అనేక మహిమలను చూపినాడు. దుర్మార్గుడైన కంసుని సంహరించినాడు. కురూపియైన కుబ్జ వక్రములు పోగొట్టినాడు. కుచేలుని ఆర్తి తీర్చినాడు. కుచేలుడు కృష్ణుని బాల్యమిత్రుడు; దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ వచ్చాడు. అతనికి అనేకమంది బిడ్డలు. వారికి కడుపు నిండా భోజనం

sri sathyasai vachanamrutam

పెట్టటానికి కూడా అతనికి స్తోమత లేదు. అందుచేత కృష్ణుని దగ్గరకు సహాయాన్ని అర్థించి వచ్చాడు. కాని, వచ్చిన పని మరచిపోయాడు. "నానుండి నీకు ఏమైనా సహాయం కావలెనా?" అని కృష్ణుడు అడిగినప్పుడు 'నాకేమీ వలదు కృష్ణా! నీవు నన్ను సదా సంరక్షిస్తూనే ఉన్నావు. నన్నే కాదు, ఈ జగత్తునే సంరక్షిస్తున్నావు" అన్నాడు. అతను అడుగకపోయినా కృష్ణుడు అతనికి బహుళ భోగభాగ్యములు ప్రసాదించాడు. కనుకనే, ఒక భక్తుడు కృష్ణ పరమాత్ముని ఈవిధంగా ప్రార్థించాడు:

"వాచామగోచరుండని
నీ చరితములను పొగడ బ్రహ్మాదులకునైన తరమా!
హే కృష్ణా! కాచుకొన్నాను నీదు కృపకై
నా మొరాలకించి బ్రోవుమయ్య
కాలుడు గొనిపోయిన గురుపుత్రుని తెచ్చి ఇచ్చినావు
కంసుని మదమణచి వసుదేవ దేవకీ చెఱను విడిపించినావు
వాలుగంటియైన ద్రౌపది 'హా కృష్ణా' యని మొరలిడ బ్రోచినావు
మేలు మేలని పాండవులను గాచినావు
కుచేలుని ఆర్తి తీర్చినావు
కురూపియైన కుబ్జా వక్రములు పోగొట్టినావు
పదహారు వేల రమామణులను ఏలినావు..."

భగవంతుడు ఏకాత్మ స్వరూపుడు. అన్ని దేహములూ తానై ఉన్నాడు. అన్ని దేహములయందూ తానే ఉన్నాడు. "ఈశ్వరస్సర్వభూతానాం", "ఈశావాస్య మిదం జగత్". అటువంటి భగవంతునికి రూపనామములు ఆపాదించి అనేక విధాలుగా వర్ణించడం మానవునియొక్క బలహీనతయే!

**రామాయణంలోని పాత్రల ఔచిత్యము, పవిత్రత**

రూపనామములకు అతీతమైన భగవత్తత్త్వమే రామతత్త్వము. రాముని తండ్రి దశరథుడు. ఈ పేరుయొక్క అర్థమేమిటి? పది ఇంద్రియములతోకూడిన రథమువంటి



sri sathyasai vahanamrutam

దేహమే దశరథుడు. దశరథునికి ముగ్గురు భార్యలు – కౌసల్య, సుమిత్ర, కైకేయి. కౌసల్యకు ఒక కుమార్తె కలిగింది. ఆమె పేరు శాంత. ఆమెను దశరథుడు ఒక రాజుకు దత్తుగా ఇచ్చాడు. ఆ తరువాత తిరిగి తనకు పిల్లలు కాలేదు. ఆనాటి కుటుంబ ధర్మము ఎలా ఉండేదంటే, భార్య అనుమతి లేకుండా రెండవ పెళ్ళి చేసుకోకూడదు. అప్పుడు దశరథుడు సుమిత్రను వివాహ మాడటానికి కౌసల్య అనుమతి కోరాడు. ఆమె ఆనందంగా ఒప్పుకుంది.

సుమిత్ర పేరుకు తగినట్లుగా చాలా పవిత్రమైన హృదయం కలిగినది. ఆమెకుకూడా సంతానం కలుగకపోయేసరికి దశరథుడు కేకయరాజు దగ్గరకు వెళ్ళి అతని కుమార్తెను తనకిచ్చి వివాహం చేయవలసిందిగా కోరాడు. కేకయ రాజ్యమనగా కాశ్మీరు దేశము. కేకయరాజు, "దశరథా! నీకు ఇద్దరు భార్యలున్నారు. ఇప్పుడు మూడవ భార్యను కోరుతున్నావు. దేనికోసం? రాజ్య పరిపాలన నిమిత్తం కుమారుడు కావాలనే కదా! అయితే, నా కుమార్తెకు పుట్టిన కుమారునికే నీవు రాజ్యమును ఇవ్వగలవా?" అని ప్రశ్నించాడు. అప్పుడు దశరథుడు అయోధ్యకు తిరిగి వచ్చి "కైకకు పుట్టబోయే కుమారునికే పట్టం కట్టాలని కేకయరాజు షరతు విధించాడు. ఇది మీ ఇద్దరికీ సమ్మతమేనా?" అని కౌసల్య, సుమిత్రలను అడిగాడు. వాళ్ళు ఎంతో ఆనందంగా అంగీకరించారు. "మీకు కుమారుడు పుట్టి రాజ్యమును పరిపాలించడమే మాకు ఆనందము" అన్నారు. అప్పుడు దశరథుడు కైకకు పుట్టబోయే కుమారునికే పట్టం కడతానని కేకయరాజుకు వాగ్దానం చేసి ఆమెని పెండ్లి చేసికొని వచ్చాడు. ఆమెకుకూడా సంతానం కలుగకపోయేసరికి పుత్రకామేష్టి యాగము సల్పాడు.

అప్పుడు యజ్ఞపురుషుడు ప్రత్యక్షమై దశరథునికి ఒక పాయసపు పాత్రను అందించి ముగ్గురు భార్యలకూ సమానంగా పంచమని చెప్పాడు. దశరథుడు ఆ పాత్రను పురోహితుని చేతికిచ్చి అతనిద్వారా ముగ్గురికీ సమానంగా అందించాడు. కౌసల్య చాలా సంతోషించింది. ఎందుకంటే "నేనే పట్టపురాణిని. కాబట్టి, నాకు పుట్టిన కుమారునికే రాజ్యము వస్తుంది" అని ఆమె భావన. వివాహ సమయంలో దశరథుడు ఇచ్చిన వాగ్దానం ప్రకారం తనకు పుట్టిన కుమారుడే రాజ్యాభిషిక్తు డవుతాడని కైకకూడా చాలా ఆనందించింది. కాని, తనకు

srisathyasaivehanamrutam

పుట్టబోయే కుమారునికి అటువంటి అవకాశం లేదని సుమిత్రకు తెలుసు. ఆమె అభ్యంగస్నానమాచరించి తన పాయసపు గిన్నెను తీసికొని మేడపైకి వెళ్ళింది. ఆ కాలంలో ఫ్యాన్లు, హెయిర్ డ్రయర్లు లేవు కదా! కనుక, ఆమె మేడ పైభాగమునకు వెళ్ళి కురులార్పుకుంటూ తన పాయసపు గిన్నెను గోడమీద పెట్టింది. ఇంతలో ఒక పెద్ద గరుడ పక్షి వచ్చి ఆ గిన్నెను తన్నుకొని పోయింది. సుమిత్ర నిశ్చేష్టురాలైంది. ఆ గరుడ పక్షి పాయసపు గిన్నెను తీసికొనిపోయి ఒక పర్వతంపైన వదలిపెట్టింది. అది చూసి అంజనాదేవి ఆ గిన్నెలో ఉన్న పాయసాన్ని తాను భుజించింది. తత్ఫలితంగా ఆమె గర్భములో హనుమంతుడు పుట్టాడు.

గరుడుడు తన పాయసపు గిన్నెను తన్నుకొనిపోవడంతో సుమిత్రకు దిక్కుతోచలేదు. తన అజాగ్రత్తకు విచారించి దశరథ మహారాజు ఏమంటాడో అని భయపడుతూ క్రిందికి దిగి వచ్చింది. కౌసల్య, కైకేయిల దగ్గరకు వెళ్లి జరిగిన సంగతి వివరించింది. అప్పుడు కౌసల్య ఆమెను ఓదార్చుతూ, "చెల్లెలా! నీవు బాధపడనక్కరలేదు. నా పాయసములో నీకు అర్ధభాగము ఇస్తాను" అని చెప్పింది. కైకకూడను తన పాయసములో అర్ధభాగము నిస్తానని చెప్పింది. ఆనాటి సవతులయొక్క ఐకమత్యము అంత గొప్పగా ఉండేది. వెంటనే ఒక బంగారు గిన్నె తెప్పించి కౌసల్య తన పాయసమునుండి అర్ధభాగమును, కైకేయి తన పాయసమునుండి అర్ధభాగమును అందులో పోసి సుమిత్రకు అందించారు. ఇంతలో పురోహితుడు పిలువగా ముగ్గురూ తమ పాయసపు గిన్నెలను తీసికొని వెళ్ళారు. ఆయన ఆశీస్సుల నందుకొని పాయసమును భుజించారు. నవ మాసములు నిండిన తరువాత కౌసల్యకు రాముడు పుట్టాడు. కైకకు భరతుడు పుట్టాడు. సుమిత్రకు మాత్రం ఇరువురు కుమారులు కలిగారు. "నాకు మాత్రమే ఇద్దరు పిల్లలు పుట్టటానికి కారణమేమిటి?" అని ఆమె ఆశ్చర్యపడింది. ఆనాడు గరుడపక్షి తన పాయసపు గిన్నెను తన్నుకొని పోయినప్పుడు కౌసల్య పాయసమునుండి అర్ధభాగమును, కైకేయి పాయసమునుండి అర్ధ భాగమును తాను భుజించడంచేత తనకు ఇరువురు కుమారులు కలిగారని గుర్తించింది. 'కౌసల్య ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడు లక్ష్మణుడు. కాబట్టి, అతడు రాముణ్ణి అనుసరించాలి.

sri sathyasai vachanamrutam

కైకేయి ఇచ్చిన పాయసమునుండి పుట్టిన శత్రుఘ్నుడు భరతునికి బంటుగా తయారు కావాలి. అదే గొప్ప పుణ్యమ'ని భావించి, తన కుమారులిద్దరినీ పిలిచి, "లక్ష్మణా! నీవు రామునికి తోడుగా ఉండాలి. శత్రుఘ్నుడు భరతునికి తోడుగా ఉండాలి" అని చెప్పి వారిని దీవించింది. తల్లి దీవెనలతో రాముణ్ణి అనుసరిస్తూ లక్ష్మణుడు, భరతుణ్ణి అనుసరిస్తూ శత్రుఘ్నుడు తమ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. రాముణ్ణి వదలి లక్ష్మణుడు ఒక్క క్షణమైనా నిలిచేవాడు కాదు. అట్లే, శత్రుఘ్నుడు భరతుణ్ణి వదలి ఒక్క క్షణమైనా ఉండేవాడు కాదు.

రాముడు అరణ్యానికి వెళ్ళే సమయంలో భరత శత్రుఘ్నులు అయోధ్యలో లేరు; కేకయరాజ్యంలో ఉన్నారు. రామునివెంట లక్ష్మణుడు బయలుదేరాడు. ఒకనాడు రామలక్ష్మణులు దండకారణ్యములో సంచరిస్తూ ఉండగా ఒక చెట్టు క్రిందికి వెళ్ళేసరికి ఉన్నట్లుండి లక్ష్మణుని మనస్సు మారిపోయింది. వెంటనే అతను రామునితో, "అన్నా! ఎందుకీ అవస్థ! అయోధ్యను వదలి మనం ఈ అరణ్యంలో కష్టాలు పడవలసిన అవసరమేమిటి! తక్షణమే అయోధ్యకు తిరిగి వెళదాం పద" అన్నాడు. అతని వింత ప్రవర్తనకు గల కారణాన్ని గ్రహించి రాముడు నెమ్మదిగా అతని భుజం పట్టుకొని ముందుకు నడిపిస్తూ, "లక్ష్మణా! తొందరపడకు, తొందరపడకు. నావెంట రా" అని పలికాడు. కొంత దూరం వెళ్ళిన తరువాత, "ఇప్పుడు చెప్పు లక్ష్మణా! మనం అయోధ్యకు తిరిగి వెళదామంటావా?" అని అడిగాడు. లక్ష్మణుడు తన పొరపాటును గ్రహించి తనను క్షమించవలసిందిగా కోరాడు. అప్పుడు రాముడు, "లక్ష్మణా! ఇవి నీ భావములు కావు. రాక్షసులు సంచరించే ప్రదేశానికి వెళ్ళడంచేత వాళ్ళ దుర్గుణములు నీలో ప్రవేశించాయి. నీ హృదయం చాలా పవిత్రమైనదని నాకు తెలుసు" అనేటప్పటికి లక్ష్మణుని మనస్సుకు శాంతి కలిగింది.

సీతారామలక్ష్మణులు పంచవటీ తీరంలో పర్ణశాల నిర్మించుకొని ఆనందంగా కాలము గడుపుతూ ఉండగా ఒకనాడు మారీచుడు రావణుని ఆజ్ఞమేరకు ఒక బంగారు లేడి రూపాన్ని ధరించి పర్ణశాలముందు అటూ ఇటూ పరుగెత్తుతూ సీత దృష్టిని ఆకర్షించాడు. సీత ఆ మృగమును పట్టి తేవలసిందిగా రాముని కోరింది. సీతను సంతోషపెట్టవలసిన

srisathyasaivachanamrutam

బాధ్యత రామునికున్నది. అప్పుడు రాముడు సీతను కనిపెట్టుకొని ఉండుమనీ, ఎట్టి పరిస్థితులయందైనను ఆమెను ఒంటరిగా విడిచి వెళ్ళవద్దనీ లక్ష్మణుని ఆదేశించి తాను ఆ మాయా మృగమును తరుముకుంటూ వెళ్ళాడు. ఎంత దూరం వెళ్లినప్పటికీ ఆ మృగము తనకు చిక్కకపోయేసరికి ఒక అస్త్రమును ప్రయోగించాడు. అది తగులగానే మారీచుడు తన నిజస్వరూపమును ధరించి, రాముని గొంతును అనుకరిస్తూ "హా సీతా! హా లక్ష్మణా!' అని అరుస్తూ నేలకూలాడు. అది విన్న సీత ఆందోళన చెంది "లక్ష్మణా! మీ అన్నగారు ఏదో ప్రమాదంలో చిక్కుకొని నిన్ను పిలుస్తున్నట్లున్నారు. తక్షణమే నీవు ఆయనకు సహాయంగా వెళ్ళు" అని అనేకవిధాలుగా తొందర చేసింది. అప్పుడు లక్ష్మణుడు "తల్లీ! రామచంద్రుని ఎట్టి రాక్షసుడైననూ ఏమీ చేయజాలడు. మీరు కంగారుపడక ధైర్యంగా ఉండండి" అన్నాడు. కాని, లక్ష్మణుడు ఎన్నివిధములుగా ధైర్యవచనములు చెప్పినా సీత వినిపించుకోలేదు. పైగా, "రాములు పోతే నీవు నన్ను ఏలుకోవాలని చూస్తున్నావా?" అని అనరాని మాటలు అన్నది. లక్ష్మణుని మనస్సు చాలా బాధపడింది. 'తల్లివంటి సీత నన్ను ఇటువంటి మాటలాడిందా?!' అని చెదిరిపోయిన మనస్సుతో అతను అక్కడినుండి బయలుదేరాడు. వెళ్లేముందు పర్ణశాల చుట్టూ ఒక గీత గీసి, "తల్లీ! ఎట్టి పరిస్థితులలోనూ మీరు ఈ గీతను దాటి బయటికి వెళ్ళకూడదు" అని చెప్పాడు. ఆమె అంగీకరించింది. లక్ష్మణుడు అక్కడినుండి వెళ్లిపోయిన తరువాత రావణుడు ఒక ఋషి వేషధారియై వచ్చి, "అమ్మా! ఆకలి, ఆకలి" అన్నాడు. 'ఆకలి' అన్న పదం వినగానే సీతకు అతనిపై జాలి కలిగింది. ఆకలి గొన్నవానికి అన్నం పెట్టడం స్త్రీ ధర్మమని భావించి, "లోపలకు రా నాయనా!" అన్నది. కాని, వాడు ఆ గీతను దాటటానికి భయపడ్డాడు. ఎంతసేపటికీ గీత దాటి లోపలికి రాకుండా 'ఆకలి, ఆకలి' అని అరుస్తూనే ఉన్నాడు. అప్పుడు ఆమె విధిలేక తానే ఆ గీత దాటి బయటికి వచ్చింది. తక్షణమే రావణుడు ఆమెను తన రథములో తీసికొనిపోయాడు. రామ, లక్ష్మణులు పర్ణశాలకు తిరిగి వచ్చేటప్పటికి సీత అక్కడ లేదు. రాముడు విచారము వెలిబుచ్చుతూ, "లక్ష్మణా! సీతను ఎందుకు నీవు ఒంటరిగా వదలి వచ్చావు?" అని ప్రశ్నించాడు. లక్ష్మణుడు, "అన్నా! వదినగారు నన్ను అనరాని, వినరాని మాటలు అన్నది. ఆ మాటలు వినలేకనే వదలిపెట్టి వచ్చాను. లేకపోతే వదలి ఉండేవాడను కాను", అన్నాడు. లక్ష్మణుణ్ణి అనరాని మాటలు

sri sathyasaivachanamrutam

అన్నందుకు సీతకూడా అశోకవనంలో కూర్చుని చాలా బాధపడుతూ వచ్చింది:

> "ఈ చెఱనుంచి వెళ్ళేనా?
> ఇక రాముల సన్నిధి చేరేనా?
> నా ముద్దు మరిది ఓ లక్ష్మణా!
> నిన్ను దుర్భాషలాడితి సద్గుణా!
> నోటి మాటలకెంతొ నొచ్చుకొని
> నన్ను విడిచిపోతివ తండ్రీ!
> నన్ను క్షమించు"

అని తనలో తాను ఎంతగానో పశ్చాత్తాపపడింది. కాని, ఏమి ప్రయోజనం? అప్పటికే జరుగకూడనిది జరిగిపోయింది.

రావణుడు సీతను అపహరించి లంకకు తీసికొని పోయాడని తెలిసికొని రామలక్ష్మణులు వానర సైన్యంతో లంకను ముట్టడించారు. ఇంద్రజిత్తుతో జరిగిన యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అతని మూర్ఛను నివారించే మూలికను తీసికొని వచ్చే నిమిత్తం హనుమంతుడు సంజీవినీ పర్వతముదగ్గరకు వెళ్ళాడు. కాని, అతను ఔషధులను గుర్తు పట్టలేక ఆ పర్వతమునే పెకలించి తన హస్తమునందుంచుకొని బయలుదేరాడు. అతను ఆకాశమార్గాన వెళుతుంటే అయోధ్యావాసులు 'ఎవరితడు? కొండను ఎత్తుకొని పోతున్నాడే' అని ఆశ్చర్యపడ్డారు. హనుమంతుని చూచి అతనెవరో రాక్షసుడని తలంచి భరతుడు ఒక బాణము ప్రయోగించాడు. అప్పుడు హనుమంతుడు క్రిందికి దిగి జరిగిన వృత్తాంతమంతా తెలిపాడు. "యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లాడు. రామాజ్ఞను శిరసావహించి నేను సంజీవినీ పర్వతము దగ్గరకు వెళ్ళాను. కాని, ఏ మూలిక అనేది నాకు తెలియకపోవడంచేత పర్వతాన్నే తీసికొని పోతున్నాను" అని వివరించాడు.

కౌసల్య, సుమిత్ర, కైకేయిలుకూడా అక్కడికి వచ్చారు. సుమిత్ర గొప్ప గుణవంతురాలు. ఆమె గుణగణములను ఏ రామాయణమునందుకూడను ఎవ్వరూ వర్ణించలేదు. ఆమె కౌసల్యను ఓదార్చుతూ, "అక్కా! శ్రీరాముడు సామాన్యుడు కాడు, ఈ ప్రపంచము నేలే

srisathyasaivachanamrutam

పరమాత్ముడు. లక్ష్మణుణ్ణి రాముడే రక్షిస్తాడు. నీవేమీ ఆందోళన చెందవద్దు" అన్నది. లక్ష్మణుని భార్య ఊర్మిళకూడా వచ్చింది అక్కడికి. లక్ష్మణుడు మూర్ఛిల్లిన వార్త విని ఆమెకూడా ఏమాత్రం ఆందోళన చెందలేదు. రాముని సేవలో ఉన్న లక్ష్మణునికి ఎటువంటి ప్రమాదమూ వాటిల్లదని ఆమె ధైర్యంగా ఉన్నది. సీత ఎంత గొప్పదో ఊర్మిళకూడా అంత గొప్పది. లక్ష్మణుడు రామునివెంట అరణ్యానికి బయలుదేరుతున్నప్పుడు ఆమె ఏమాత్రం విచారించలేదు. తన పతికి రామసేవ చేసే భాగ్యము లభిస్తున్నందుకు ఎంతో ఆనందించి, "నాథా! నీవు నాగురించి యోచిస్తూ కాలమును వ్యర్థం చేయవద్దు. రామసేవను ఏమాత్రం అలక్ష్యము చేయవద్దు. నిరంతరము రామసేవలో నిమగ్నుడవు కమ్ము" అని చెప్పింది. సుమిత్ర, ఊర్మిళ వీరందరూ గొప్ప స్త్రీలు. వీరందరి మాటలు వినడంచేతనే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు క్షేమంగా ఉన్నారు.

హనుమంతునిద్వారా జరిగిన వృత్తాంతమంతా విని భరతుడు "హనుమంతా! నా పొరపాటును క్షమించు. ఈ సమయంలో నిన్ను నిలబెట్టటం మంచిది కాదు. శీఘ్రముగా సంజీవినీ పర్వతమును తీసికొని పొమ్మ"ని ఆజ్ఞాపించాడు. హనుమంతుడు భరతునికి నమస్కరించి, "మేము అతిశీఘ్రకాలంలోనే రావణుని జయించి అయోధ్యకు వచ్చి చేరతాము" అని చెప్పి బయలుదేరాడు. భరతుడు ఈ వార్తను ఆనందంగా అయోధ్యలో ఉన్న ప్రజలకు చాటించాడు. "ఇంతకాలము మనకు తెలియనటువంటి సీతారామలక్ష్మణుల క్షేమసమాచారం ఈనాడు హనుమంతునిద్వారా తెలిసింది కదా" అని అయోధ్యలో అందరూ ఆనందించారు.

హనుమంతుడు తీసికొని వెళ్ళిన మూలికలను తగిలించగానే లక్ష్మణుడు లేచి కూర్చున్నాడు. అందరూ కలిసి రావణుని ఏవిధంగా జయించాలి? అని చర్చించుకున్నారు. యుద్ధంలో తన కుమారుడైన మేఘనాథుడుకూడా మరణించిన తరువాత రావణుడే స్వయంగా యుద్ధానికి వచ్చాడు. రాముడు విభీషణుని సలహా ననుసరించి ఒక బాణముతో రావణుని నాభి ప్రదేశము నందున్న అమృతకలశమును శోషింపజేసి వానిని సంహరించాడు.

రావణుని మరణవార్తను హనుమంతుడు సీతకు తెలియజేశాడు. శ్రీరాముడు అంగద



srisathyasaivachanamrutam

విభీషణాదులను పిలిచి హనుమంతునితో వెళ్ళి సీతను గౌరవ మర్యాదలతో తనచెంతకు తీసికొనిరావలసిందిగా ఆజ్ఞాపించాడు. వానరులు అంతకు ముందెన్నడూ సీతను చూడలేదు. అందుచేత ఆమె రాముని సన్నిధికి నెమ్మదిగా నడచి వస్తుంటే ఒకరిపైన ఒకరు ఎగిరి ఆమెను చూసి నమస్కరించారు; ఆనందంతో జయజయధ్వానాలు చేశారు. కాని, సీతను ఇప్పుడే తన చెంతకు తెచ్చుటకు వీలులేదనీ, ఆమెను అగ్నిపరీక్ష గావించవలసి ఉన్నదనీ రాముడు పలికేసరికి వానరులు క్రుంగిపోయారు. రామాజ్ఞ మేరకు కట్టెలు తెచ్చి చితిని పేర్చి నిప్పంటించారు. సీత దాని చుట్టూ తిరిగి "ఓ అగ్నిదేవా! మనోవాక్కాయకర్మలచే నేను శ్రీరాముని తప్ప మరెవరినీ నా మనస్సులో ధ్యానించి యుండనిచో నీవు నాకు శీతలుడవగుదువు గాక" అని పలికి అందులో దుమికింది. తక్షణమే అగ్నిదేవుడు ప్రత్యక్షమై, "రామచంద్రా! సీత మహాపతివ్రత. నీకన్నీ తెలిసికూడను సీతయొక్క మనస్సును గుర్తించలేక పోయావా?" అన్నాడు. అప్పుడు రాముడు, "నాకు తెలియక కాదు. కాని, లోకానికి నేను జవాబుదారీగా ఉన్నాను. ప్రపంచానికి ఈమె పవిత్రతను నిరూపించే నిమిత్తం నేనీ పని చేశాను. అది నా బాధ్యత" అన్నాడు. అందరూ హర్షాతిరేకంతో జయజయధ్వానాలు చేశారు. తలవంచుకొని నిలిచిన సీతను రాముడు దగ్గరకు వెళ్ళి చేయిపట్టుకొని తీసికొని వచ్చాడు.

కుబేరుని పుష్పక విమానంలో కూర్చుని సీతారామ లక్ష్మణులు, విభీషణుడు, సుగ్రీవ హనుమంతాది వానర వీరులు అందరూ కలిసి అయోధ్యకు చేరుకున్నారు. భరతుడు సీతారాములను రథములో కూర్చుండజేసి తాను స్వయంగా రథాన్ని నడుపుతూ వారిని స్వాగతపూర్వకముగా రాజభవనమునకు తీసికొని వచ్చాడు. దారిపొడవునా అయోధ్యా ప్రజలు భరతునికి హారములు వేయడం ప్రారంభించారు. ఎందుకంటే, పద్నాల్గు సంవత్సరాలు నిరంతర రామచింతనలో కాలం గడపటంచేత అతను రాముని మాదిరి కనిపిస్తున్నాడు. "యద్భావం తద్భవతి". అప్పుడు భరతుడు లేచి "రాముడు ఇక్కడున్నాడు" అని చూపించగా ప్రజలు రామునికి హారములు వేశారు. "రామా కోదండ రామా...." అని పాడుకుంటూ, ఆడుకుంటూ స్వాగతం పలికారు. రామునియొక్క పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది.

sri sathyasai vahanamrutam

రామనామములో ఉన్న మహత్తరమైన సారము మరి దేనియందూ లేదు. రాముడు ఆడిన మాట తప్పనివాడు. రాముని మాట సత్యమైన మాట. అతని మాట, అతని బాట చాలా మంగళకరమైనవి. అటువంటి మాటను, అటువంటి బాటను అనుసరించి ఆనాటి అయోధ్యావాసులు ధన్యులైనారు. రామకథ జరిగి ఇన్ని వేల సంవత్సరములైనప్పటికీ ఈనాటికినీ ప్రజలు 'రామ, రామ, రామ' అని రామనామమును జపిస్తూనే ఉన్నారు. రాముని గుడి లేని గ్రామము భారత దేశములో ఎక్కడా కనిపించదు. అట్లే, రామ నామము పలుకని వ్యక్తికూడా కనిపించదు.

పిల్లల్లారా! మీరు ఎన్నో కథలు చదివి ఉంటారు. అన్నీ స్టోరీలు. అన్నీ కల్పనలు. ఇది ఒక్కటే సత్యమైనది. రామచరిత్రము ఎంతో పవిత్రమైనది. కనుక, మీరు నిరంతరము ఎలాంటి సమయమునందైనను రామ నామాన్ని స్మరిస్తూ ఉండండి. ఇదియే ఈనాడు నేను మీకందించే కానుక. ఈనాడు కృష్ణాష్టమి అయినప్పటికీ ఈరోజునకూడా రామనామ స్మరణ చాలా అవసరమైనది. కృష్ణుని తత్త్వము, రాముని తత్త్వము భిన్నము కాదు. రామ, కృష్ణులు ఇద్దరూ ఒక్కటే. కనుక, మీరు ఏ నామమునైనా స్మరించవచ్చును. 'రామకృష్ణా' అని స్మరించ వచ్చును. లేక, స్వామిపైన ప్రేమతో 'సాయిరామా, సాయికృష్ణా' అని స్మరించ వచ్చును. మీరు ఎన్ని చదువులు చదివినప్పటికీ భగవన్నామాన్ని మాత్రము మరచిపోకూడదు. ఆ నామస్మరణ ఒక్కటి ఉంటే చాలు. అదే అన్ని బాధలనూ హరిస్తుంది, భవసాగరాన్ని దాటిస్తుంది.

**(శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశం, తేదీ 4.9.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vahini amrutam